క్లుప్తంగా

నేడు గడివేములలో కాటసాని పర్యటన

గడివేముల: మండల కేంద్రం గడివేములతో పాటు బూజునూరు గ్రామాల్లో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ శివరామిరెడ్డి తెలిపారు. ఆయా గ్రామాల్లో రోడ్‌షోలతో పాటు ప్రసంగాలు ఉంటాయని తెలిపారు. మండల నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

నేడు పోలకల్‌లో వైఎస్సార్‌సీపీ ప్రచారం

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ బొంతల మునెప్ప తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని చెప్పారు. పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ పాలన



గూడూరులో ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు

గూడూరు: వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ పాలన సాధ్యమని మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ పీఎన్ అస్లామ్ అన్నారు. పట్టణంలోని దళితవాడల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుంటే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత, తదితర పథకాలు కొనసాగాలంటే ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు. మున్సిపాలిటీ వైస్ చైర్మన్–2 బోయ లక్ష్మన్న, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎల్.వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ పట్టణ కమిటీ కన్వీనర్ జె.ఆబేల్, నాయకులు పత్తి రంగడు, ప్రవీణ్, ప్రతాప్, కౌన్సిలర్లు దాస్, బజారి, కలామ్, షేక్‌షావలి, టీచర్ కిషోర్, నంద కిషోర్, కుమార్, మదార్, క్రాంతిగౌడ్, మల్లి, మధు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు అండగా నిలవండి



గడివేములలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గడివేముల: సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మహేశ్వరరెడ్డి, ఉప సర్పంచ్ బాలచెన్ని ప్రజలను కోరారు. గురువారం గడివేములలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ నాయకులు నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

94 మద్యం బాటిళ్లు స్వాధీనం

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ పరిధిలోని సి.బెళగల్ మండలం బురాన్‌దొడ్డి గ్రామానికి చెందిన బోయ గోవిందు ఇంట్లో గురువారం తమ సిబ్బందితో సోదాలు నిర్వహించి 94 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

వీవీప్యాట్‌లలో అభ్యర్థుల వివరాల నమోదు



ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను వివరిస్తున్న రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): కర్నూలు నియోజకవర్గ ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియలో భాగంగా వీవీ ప్యాట్లు, కంట్రోల్ యూనిట్లలో అభ్యర్థుల వివరాలు నమోదు చేస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ స్పష్టం చేశారు. గురువారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియలో శిక్షణ పొందిన 50 మంది అధికారుల బృందాలు పాల్గొని అభ్యర్థుల పేర్లు, వివరాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అవుతున్నందున ఎన్నికల సిబ్బంది ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవాలన్నారు. అభ్యర్థుల పేర్లను భారత ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్‌కు చెందిన ఇంజినీర్లు కంట్రోల్ యూనిట్లలో అప్ లోడ్ చేస్తారన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, నగరపాలక అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ పాల్గొన్నారు.

జగన్‌తోనే జనరంజక పాలన

- ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామాల అభివృద్ధి
- రైతులకు రెండు పంటలకు నీరందించి అండగా నిలబడ్డాం
- టీడీపీ హయాంలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలి
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- పాణ్యం మండలంలో విస్తృత ప్రచారం



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన చేశారని.. గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దారని.. కరోనాతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తినా సంక్షేమం, అభివృద్ధి ఆగలేదని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని గగ్గటూరు, కొత్తూరు, అనుపూరు, అహల్యాపురం, భూపనపాడు, మద్దూరు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఐదేళ్లలో ప్రతి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ ఏర్పాటు చేశామన్నారు. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చివేశారని తెలిపారు. సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, కాలువలు నిర్మించామన్నారు. గతంలో గ్రామాలు ఎలా ఉండేవి.. ఇప్పుడు ఎలా ఉన్నాయో ప్రజలే గమనించాలన్నారు. టీడీపీ నాయకులు తమ హయాంలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. అభివృద్ధి చేయకపోగా మంచి చేసిన ప్రభుత్వంపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు ఏం చేయలేని వారు ఇప్పుడు తనపై విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. చేసిన మంచి పనులను చెప్పుకోవాలే గాని బురద జల్లడం సరికాదన్నారు. వారి హయాంలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరన్నారు. నీటి కోసం రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. కరెంటు ఎప్పుడు వస్తుందో తెలియక రాత్రి పూట పొలాల్లోనే నిద్రమానుకుని గడిపారని గుర్తు చేశారు.

టీడీపీ నేతలు రైతుల కడుపు కొట్టారు

గత ప్రభుత్వ హయాంలో గోరుకల్లు ఆయకట్టు నుంచి బనగానపల్లెకు జలహారతి కోసం నీటిని తరలించారని ఎమ్మెల్యే మండిపడ్డారు. ఆయకట్టు నీటి హక్కులను కాలరాసి మండల రైతులను కడుపుకొట్టి బీసీ జనార్ధన్‌రెడ్డి నీటిని తరలిస్తుంటే ఆ నాడు అధికారంలో ఉన్న వారు ఒక్క మాట కూడా మాట్లాడలేదని విమర్శించారు. పోలీసులను పెట్టి నీటిని తరలిస్తున్న క్రమంలో రైతులు హైవేపై ధర్నా చేసినా పట్టించుకోలేదని తెలిపారు. వారి హయాంలో ఒక పంటకు నీరందించడమే గగనంగా ఉండేదన్నారు. తమ ప్రభుత్వంలో రెండు పంటలకు నీరందించి రైతులను ఆదుకున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సరళమ్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీదేవి, సంధ్యారాణి, సర్పంచ్‌లు సద్దల పద్మావతి, బీరం రాజేశ్వరి, కంపమళ్ల నాగలక్ష్మమ్మ, ప్రదీప్‌రెడ్డి, జనార్దన్, నాయకులు సద్దల శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఖాదర్, కృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివరామిరెడ్డి, నారాయణస్వామి, వీరయ్య, శ్రీనివాసులు, సుమంత్‌రెడ్డి శ్రీనాథ్‌రెడ్డి, రామలక్ష్మయ్య, మహేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గగ్గటూరులో మాట్లాడుతన్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

పాణ్యం: మండలంలోని అహలాయపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గన మద్దిలేటి, భూపననాడులో దామరేకుల ఫిలిప్ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారిద్దరికీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కొత్తూరు సచివాలయం పరిధిలో రూ.2 కోట్ల అభివృద్ధి పనులు

కొత్తూరు గ్రామ సచివాలయ పరిధిలో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. అలాగే మొదటిసారిగా కొత్తూరు గ్రామ సచివాలయంలో భూముల రిజిస్ట్రేషన్‌ను ప్రారంభించామన్నారు. గగ్గటూరు గ్రామానికి ఊరుమందు వాగుపై రూ. 2 కోట్లతో బ్రిడ్జి నిర్మించేందుకు అనుమతులు వచ్చాయన్నారు. అయితే కోడ్ కారణంగా ప్రక్రియ ఆగినట్లు తెలిపారు. అలాగే కొత్తూరు గ్రామంలో రూ.2.5 కోట్లతో ఆలయాన్ని అభివృద్ధి చేశామన్నారు. అలాగే మౌలిక వసతులు కల్పించామని చెప్పారు.

ప్రజా సేవకుడిని గెలిపించండి

ఓర్వకల్లు: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం శ్రమిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని ఆయన కుమార్తె కాటసాని మాధవీలతారెడ్డి ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని నన్నూరు గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల కోసం పరితపించే కాటసానిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పోచా బ్రహ్మానందరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీరెడ్డి చెన్నారెడ్డి, సర్పంచ్ బ్రహ్మయ్య పాల్గొన్నారు.



నన్నూరులో ప్రచారం చేస్తున్న కాటసాని మాధవీలతారెడ్డి

పేదలకు అండగా వైఎస్సార్‌సీపీ



41వ వార్డులో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ శ్వేతారెడ్డి

కల్లూరు: పేదలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని కల్లూరు అర్బన్ 41వ వార్డు కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి అన్నారు. గురువారం వీకర్‌సెక్షన్ కాలనీలో ఇంటింటికి తిరుగుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ ఐదేళ్లలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేసిన మంచిని వివరించారు. మరోసారి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని గెలిపించుకుంటే వార్డు మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగులు, ప్రతాప్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రేపు కూచిపూడి నవ వసంతం

కర్నూలు కల్చరల్: భరత కళా గ్రామ, నాట్య వేద కూచిపూడి కళా నిలయం, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో కూచి పూడి నవ వసంతం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నాట్యాచార్యులు కె.తేజేశ్వర్, పి. రోహిత్ కుమార్ తెలిపారు. కార్యక్రమానికి కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కూచిపూడి సిద్ధేంద్ర యోగి కళా పీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, కేంద్ర సంగీత నాటక అకాడమీ బిస్మిల్లాఖాన్ యువ పురస్కార్ అవార్డు గ్రహీత బెంగళూరు భరత కళా గ్రామ అధ్యక్షులు డాక్టర్ ఆర్. వసంత్ కిరణ్ అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. కళాకారులతో కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు



రాజీనామా పత్రాలను చూపుతున్న వలంటీర్లు



ఎంపీడీఓకు రాజీనామా అందజేస్తున్న వలంటీర్లు



కోడుమూరు: రాజీనామా పత్రాలను ఎంపీడీఓకు అందజేస్తున్న వలంటీర్లు

సి.బెళగల్: మండల పరిధిలో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. సి.బెళగల్ గ్రామ సచివాలయం–1, 2 లకు చెందిన 16 మంది, పోలకల్–1 సచివాలయానికి చెందిన ఐదుగురు వలంటీర్లు రాజీనామా చేశారు. ఈ మేరకు గురువారం రాజీనామా పత్రాలను ఎంపీడీఓ శకుంతలకు అందజేశారు. వీరిలో సి.బెళగల్ సచివాలయాలకు చెందిన తిమ్మప్ప, తిరుమలేష్, మధు, చిట్టెమ్మ, శివ, కట్టుబడి వలి, రామలింగమ్మ, మౌనిక, విజయలక్ష్మి, గీతాంజలి, ప్రమీల, వీరేంద్ర, కుమార్, రాజారత్నం, అబ్దుల్, బుడ్డమ్మ, పోలకల్–1 సచివాలయానికి చెందిన మహానందమ్మ, లోకేశ్వరమ్మ, పెద్ద మద్దిలేటి, ప్రమీల, హైమావతి ఉన్నారు.

గూడూరు: మండలంలోని కె.నాగులాపురానికి చెందిన 10 మంది, గుడిపాడుకు చెందిన ఇద్దరు వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ కుమారి జయశ్రీకి రాజీనామా పత్రాలను అందజేశారు. ఇప్పటి వరకు మండలంలో 24 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. అలాగే మున్సిపల్ పరిధిలో ఇద్దరు వలంటీర్లు రాజీనామా చేసినట్లు అధికారులు తెలిపారు.

కోడుమూరు రూరల్: మండలంలోని కోడుమూరు–3, గోరంట్ల, వర్కూరు–1,2 గ్రామ సచివాలయాలకు చెందిన 15మంది వలంటీర్లు రాజీనామా చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ దివ్యకు రాజీనామాలను సమర్పించారు.

బాబు ఏడి ‘పింఛెన్’

- వృద్ధులను వెంటాడుతున్న పింఛన్ కష్టాలు
- ఉదయం నుంచి సాయంత్రం వరకు బ్యాంకుల వద్ద పడిగాపులు
- చంద్రబాబు తీరుపై ఆగ్రహం

గడివేముల/కోడుమూరు రూరల్: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చేసిన పనికి వృద్ధులను పింఛన్ కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రతి నెలా ఒకటో తేదీ ఠంఛనుగా ఇంటి వద్దే పింఛన్లు తీసుకునే వారు ఇప్పుడు సచివాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత నెల సచివాలయల చుట్టూ తిరిగి అలసిపోయిన వృద్ధులు ఈ నెల బ్యాంకుల వద్ద పడిగాపులు కాయల్సి వచ్చింది. గడివేముల, కోడుమూరు మండలాల్లోని పింఛన్ లబ్ధిదారులు గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పింఛన్ల కోసం బ్యాంకుల వద్ద ఎదురుచూశారు. కోడుమూరు మండలంలోని ఏ బ్యాంకు వద్ద చూసినా పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న వృద్ధులే కనిపించారు. రాజకీయ కక్షలతో మాలాంటి పేదోళ్ల జీవితాలతో ఆడుకోవడం దారుణమని వాపోయారు. కాగా గడివేముల మండలంలో మొత్తం 5864 పింఛన్‌దారులు ఉండగా అందులో 1,351 మందికి సచివాలయ సిబ్బంది ఇళ్ల వద్దే నగదు అందించేందుకు చర్యలు తీసుకున్నారు.



ఎండలో పింఛన్ తీసుకొస్తున్న వృద్ధురాలు

సి.బెళగల్‌లో 75 శాతం పంపిణీ

సి.బెళగల్: మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో 7,330 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా, డైరెక్ట్ టూ బెనిఫిషరీ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ)లో 5,612 మందికి, మిగిలిన 1,718 మందికి ఇళ్ల దగ్గర పింఛన్ పంపిణీకి అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందులో గురువారం నాటికి 1,492 మందికి పంపిణీ చేయడంతో 85.86 శాతం పూర్తయ్యింది. ఇటు డీబీటీలో 5,612 మందికి జమైన నగదులో 4,259 మందికి బ్యాంక్ అధికారులు నగదు అందజేశారు. ఏ బ్యాంక్ ఖాతాకు పింఛన్ జమ అయ్యిందో తెలియక పలువురు అయ్యాయ్యో తెలియక తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



కోడుమూరు: ఏపీజీబీ వద్ద డబ్బులు జమయ్యాయో లేదో తెలుసుకుంటున్న వృద్ధులు


మా అవస్థలు చూస్తే చంద్రబాబుకు సంతోషం



టీడీపీ పాలనలో పింఛన్ల కోసం వారం రోజుల పాటు కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది. అయినా అందేది కాదు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ వచ్చాక వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీ ఇంటికొచ్చి పింఛన్ ఇచ్చేవారు. సంతోషంగా ఉన్నాం. ఇప్పుడు చంద్రబాబు మళ్లీ పాత కష్టాలు గుర్తు చేశారు. మేం సంతోషంగా ఉండడం ఆయనకు ఇష్టం లేదేమో. మేం అవస్థలు పడుతుంటే చంద్రబాబుకు సంతోషంగా ఉంటుదేమో. గత నెలలో సచివాలయ సిబ్బంది కార్యాలయంలోనే పింఛన్ సొమ్మును అందజేశారు. ఈ నెల మాత్రం బ్యాంకుల్లో జమ చేయడంతో ఎండలో తీవ్రంగా ఇబ్బందులు పడ్డాం.

–దస్తగిరి, పింఛన్‌దారుడు, గడివేముల

మాపై ఎందుకంత కక్ష సాధింపు



ప్రతి నెలా వలంటీర్ ఇంటికొచ్చి తాతా పింఛన్ తీసుకో అంటూ ఆప్యాయంగా ఇచ్చిపోయేవాడు. అలాంటి వలంటీర్‌ను కక్షసాధింపులతో దూరం చేయడం సరికాదు. మాకు పింఛన్ ఇవ్వకుండా చేయడం వల్ల చంద్రబాబుకు ఏం వస్తుందో అర్థం కావడం లేదు. బాబు నిర్వాకం వల్ల పాతరోజుల్లో మాదిరి ఆఫీస్‌లు, బ్యాంకుల వద్ద పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్నా. బ్యాంకు వద్ద ఉదయం 8 గంటల నుంచి వేచివున్నా నావంతు రాలేదు. ఈ రోజైనా పింఛన్ డబ్బులు అందుతాయో లేదో తెలియదు.

–సుబహాన్, పింఛన్‌దారుడు, ప్యాలకుర్తి గ్రామం, కోడుమూరు



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

జగనన్నను గెలిపించుకుంటేనే భవిష్యత్

- మాయ మాటలు చెప్పే బాబును నమ్మకండి
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి
- అమడగుంట్లలో ఎన్నికల ప్రచారం



వృద్ధుడిని ఓటు అభ్యర్థిస్తున్న సతీష్

కోడుమూరు: పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించి.. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన జగనన్నను గెలిపించుకుంటేనే రాష్ట్ర ప్రజలకు బంగారు భవిష్యత్ ఉంటుందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అమడగుంట్ల గ్రామంలో మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ భీమిరెడ్డి, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి కుటుంబానికి మేలు జరిగిందన్నారు. ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. మహిళల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేశారన్నారు. పాఠశాలలు, ఆస్పత్రులను సుందరంగా తీర్చిదిద్ది పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించారన్నారు. ప్రస్తుతం పేదలకు, పెత్తందారుల మధ్య ఎన్నికలు జరుగుతున్నాయని, అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, భవిష్యత్‌లో మరిన్ని పథకాలు పొందాలన్నా మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్న చంద్రబాబుకు ఈ ఎన్నికల్లో మరోసారి బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో గూడూరు జెడ్పీటీసీ సభ్యుడు మౌలాలి, ఎర్రదొడ్డి సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జేసీఎస్ మండల కన్వీనర్ మధుమోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు తిరుపతయ్య, నాయకులు మస్తాన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, పి.క్రిష్టారెడ్డి, శ్రీరాములు, బాలు, శ్రీనివాసులు, కల్లపరి పురంధర్‌రెడ్డి, కె.నాగలాపురం నరసింహారెడ్డి, బాలమద్దిలేటి, పవన్, సుధాకర్, రఫీ తదితరులు పాల్గొన్నారు.



ఓటు అభ్యర్థిస్తున్న సతీష్

➡ టీడీపీ ఎంపీ అభ్యర్థి గ్రామంలో విశేష స్పందన

కర్నూలు (సిటీ): కర్నూలు రూరల్ మండలం పంచలింగాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొత్తకోట ప్రకాష్‌రెడ్డి, ఎం.మణిగాంధీ నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. టీడీపీ ఎంపీ అభ్యర్థి గ్రామమైనా వైఎస్సార్‌సీపీకి మద్దతుగా భారీ సంఖ్యలో తరలివచ్చారు. బహిరంగ సభలో నాయకులు మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే రంగురంగుల మేనిఫెస్టోతో ప్రజల ముందుకు వస్తుంటారన్నారు. అధికారం కోసం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకోకుండా కల్లబొల్లి మాటలను ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే ఓట్లు అడుగుతున్నారని తెలిపారు.

➡ టీడీపీకి ఓటేస్తే ముస్లిం రిజర్వేషన్లు రద్దు

జగన్‌మోహన్‌రెడ్డిని ఒంటరిగా ఎదుర్కోలేక టీడీపీ, జనసేన, బీజేపీ చేతులు కలిపాయన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ అమలు చేశారని.. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే 4 శాతం రిజర్వేషన్లను రద్దు చేస్తామని బీజేపీ పెద్దలు చెబుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసే ముందు ఆలోచించి మంచి చేసిన ప్రభుత్వానికి ఓటు వేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్, పార్టీ మండల కన్వీనర్ మహబూబ్ బాషా, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు డి.వాసు, వైస్ ఎంపీపీ నెహిమియా, ఎంపీటీసీలు రామ్‌నాథ్‌రెడ్డి, హనుమంతు, రేమట సంపత్‌కుమార్, ఉల్చాల సర్పంచ్ విద్యాసాగర్, సింగిల్ విండో చైర్మన్ వినయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్, పంచలింగాల వెంకటేశ్వరరెడ్డి, గచ్చెంటి శేఖర్, నారాయణరెడ్డి, ఉప్పల నవీన్‌రెడ్డి, బోయ సాయన్న, చింతమాగుల వెంకటేశ్వర్లు, చిన్నలక్ష్మన్న, అజీజ్, జి.శింగవరం వెంకటేశ్వరరెడ్డి, రవిరెడ్డి, భాస్కర్, ఫిరోజ్‌ఖాన్, సంపత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదిమూలపు సతీష్

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక




పార్టీలో చేరిన వారితో కాటసాని శివనరసింహారెడ్డి


కల్లూరు: ఓర్వకల్లు మండలం కాల్వ గ్రామం జంగాల పేటకు చెందిన 40 టీడీపీ కుటుంబాలు గురువారం ఎర్రద్దుల సుల్తాన్ ఆధ్వర్యంలో యువనేత కాటసాని శివనరసింహారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈశ్వరయ్య, ఎల్లప్ప, ఎల్ల సుబ్బుడు, చంద్ర, సుబ్బరాయుడు, హరి, శాలన్న, వంశీ, బాబు తదితరులు చేరిన వారిలో ఉన్నారు. అనంతరం కాటసాని శివనరసింహారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న అందిస్తున్న పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. నవరత్నాల పథకాల వల్ల రాష్ట్రంలో ప్రతి గడపకు లబ్ధి చేకూరిందన్నారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు.

గ్రామాల్లో తాగునీటి సమస్యలు రానీయొద్దు

- కోడుమూరు సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు



నీటి సమస్యపై అధికారులతో చర్చిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు



సర్వసభ్య సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

కోడుమూరు రూరల్: వేసవి దృష్ట్యా గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోడుమూరు ఎంపీపీ గాడి రూతమ్మ, జడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గాడి రూతమ్మ అధ్యక్షతన ఎంపీడీఓ దివ్య మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ.. మండలంలో మరమ్మతులకు గురైన చేతి పంపులు, బోర్లను తక్షణమే రిపేరు చేయించాలని సూచించారు. జీడీపీ నీటిని హంద్రీకి విడుదల చేయాలన్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ వర్క్ఇన్‌స్పెక్టర్ మద్దిలేటి మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో ఉంచుకుని మండలంలోని హంద్రీనది పరివాహక ప్రాంతాలైన కోడుమూరు, వర్కూరు, ముడుమలగుర్తి, గోరంట్ల గ్రామాల్లో నీటి సమస్య పరిష్కారానికి గాజులదిన్నె ప్రాజెక్టు నీటి విడుదల కోసం ఉన్నతాధికారులకు లేఖ పంపామని తెలిపారు. శుక్రవారం నుంచి నీటిని విడుదల చేస్తారన్నారు. ఏపీఓ మోదీన్‌బాషా మాట్లాడుతూ.. గ్రామాల్లో వలసలు నివారించేందుకు ఉపాధి పథకం కింద కూలీలందరికీ పనులు కల్పిస్తున్నామని చెప్పారు. కూలీలకు రోజువారి వేతనం రూ.300 పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ దివ్య మాట్లాడుతూ.. సభలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను ఆయా శాఖల అధికారులు పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. లద్దగిరి హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్‌యాదవ్, మండల ఉపాధ్యక్షురాలు మాధవి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.